సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం। 19। జనవరి। 2023



ప్రాణం తీసిన అతివేగం

ఓబులవారిపల్లె మండలం అప్పగుంటపల్లె గ్రామం సమీపంలో కారు చెట్టును ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. - 8లో



కార్గో ఆదాయం అదుర్స్

కార్గో సరుకు రవాణాలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఊహించిన దానికంటే అధిక ఆదాయాన్ని ఆర్జిస్తోంది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.250	రూ.320
రెండోరకం	రూ.150	రూ.248

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 134 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	662	662
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 30.48 కిలోలు

న్యూస్‌రీల్

అగ్నిపథ్ అభ్యర్థులకు పరీక్షలు

రాయచోటిటౌన్ : అగ్నిపథ్ పథకం కింద జాతీయ వాయుసేనలో అగ్నివీర్ నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వివిధ రకాలైన పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సి. సాయి గ్రేస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 4వతేదీ నుంచి 5వ తేదీ వరకు గ్రూప్ 'వై' మెడికల్ అసిస్టెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నవారికి, అలాగే ఫిబ్రవరి 7వ తేదీ నుంచి 8వ తేదీ వరకు గ్రూప్ 'వై' మెడికల్ అసిస్టెంట్ (డిప్లమా/ ఫార్మసీలో బిఎస్‌సీ చేసిన అభ్యర్థులకు పరీక్షలు ఉంటాయన్నారు. ఈ పరీక్షలు చెన్నైలోని తాంబరం ఎయిర్ ఫోర్స్ స్టేషన్లో నిర్వహిస్తారని చెప్పారు. మరిన్ని వివరాల కోసం 9345377864 నంబరులో సంప్రదించాలన్నారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి అర్బన్: జిల్లాలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీకి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 23 మండలాల్లో 2 మున్సిపాలిటీలలో 97 వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇందులో 75 పోస్టులు గ్రామాల్లోను, 22 పోస్టులు మున్సిపల్ పరిధికి చెందినవన్నారు. అభ్యర్థులు హెచ్‌టీటీపీ //40. 81. 241.107/ ఏపీవలంటీర్20 వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

కడప ఎయిర్‌పోర్టు అసిస్టెంట్ కమాండెంట్ సస్పెన్షన్

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప విమానాశ్రయం అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాసరావును సస్పెండ్ చేస్తూ ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కడప ఎయిర్‌పోర్టు ప్రహరీ గోడకు ఫెన్సింగ్ అమర్చడంలో, విమానాశ్రయం లోపల, వెలుపల కుప్పలుగా పేరుకుపోయిన మట్టి దిబ్బలను తొలగించడంలో విఫలమైనందున.. అలాగే ఈ నెల 10న పగటిపూట విమానాశ్రయంలోకి ఓ పౌరుడు చొరబడినందున శ్రీనివాసరావును సస్పెండ్ చేశారు.

అన్నగారికి.. వర్గసెగ

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ఎన్టీ రామారావు 27వ వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లాలో తెలుగుదేశం పార్టీ నాయకుల మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి. ఆధిపత్యం కోసం తహతహలాడుతున్న తెలుగు తమ్ముళ్లు ఎన్టీఆర్ విగ్రహాల సాక్షిగా వాగ్వాదాలకు, ఘర్షణలకు తెర తీశారు. దీంతో అసలే అంతంతమాత్రంగా ఉన్న పార్టీ పరువు కాస్తా మరింత దిగజారిపోయిందనే ఆవేదన ఆ పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.

- ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా భగ్గుమన్న టీడీపీ విభేదాలు
- వేర్వేరుగా నివాళులర్పించిన పార్టీ నాయకులు
- జిల్లాలో ప్రతి నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి



చిట్వేలి:ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కస్తూరి, తదితరులు



చిట్వేలి:ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నరసింహప్రసాద్ వర్గీయుల నివాళి

సాక్షి, రాయచోటి: అన్నమయ్య జిల్లా తెలుగుదేశం పార్టీలో అంతర్మథనం కొనసాగుతోంది. ఆధిపత్య పోరులో ఒకరిపై మరొకరు పెత్తనం చెలాయించేందుకు తహతహలాడుతున్నారు. అధినేత వద్ద మెప్పు కోసం ఒకరు.. అధిష్టానంలో పలుకుబడి కోసం మరొకరు అన్నట్లు ఎత్తులకు పైఎత్తులు వేసుకుంటున్నారు. ఏ నియోజకవర్గంలో చూసినా తెలుగుదేశం పార్టీలో అంతర్యుద్ధం తప్పడం లేదు. ఎక్కడ చూసినా ప్రధాన నేతల మధ్య వర్గ విభేదాలతో ఉన్న కాస్త పార్టీ పరువు గంగలో కలుస్తోంది. జిల్లాలో బలంగా ఉన్న వైఎస్సార్ సీపీని ఎదుర్కోలేక అల్లాడిపోతున్న టీడీపీకి ఈ వర్గ విభేదాలు మరింత తలనొప్పిగా తయారయ్యాయి. టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత ఎన్టీ రామారావు 27వ వర్ధంతి కార్యక్రమాల్లో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా కార్యక్రమాలు నిర్వహించడంతో విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి.

ఎవరికి వారే...యమునా తీరే!

జిల్లా కేంద్రమైన రాయచోటిలో మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్‌రెడ్డి లక్కిరెడ్డిపల్లెలో కార్యక్రమం నిర్వహించగా, నియోజకవర్గ, టిక్కెట్ ఆశిస్తున్న టీడీపీ నేతలు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సుగవాసి ప్రసాద్‌బాబులు ప్రత్యేకంగా ఎవరికి వారు కార్యక్రమాలు నిర్వహించారు. ముగ్గురు కలిసి ఒకేచోట పాల్గొన్న పరిస్థితులు కనిపించలేదు. నేతలు తలోదారి కావడంతో తమ్ముళ్లు కూడా ఎవరికి తోచిన రీతిలో ఏ వర్గానికి ఇష్టమున్న నాయకుడిని పిలిపించుకుని కార్యక్రమాన్ని నిర్వహించారు. మదనపల్లెలో మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, టీడీపీ ఎంపీ అభ్యర్థి హరహరిలు పలుచోట్ల కార్యక్రమాల్లో పాల్గొంటే, మిగిలిన వర్గాలు పలుచోట్ల కార్యక్రమాలు నిర్వహించారు. అలా వివిధ చోట్ల నాయకులు ఎవరికి వారుగా నిర్వహించడంతో వర్గ విభేదాలు బయటపడ్డాయి. రాజంపేటలోనూ మాజీ ఎమ్మెల్సీ చెంగల్రాయులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తే, మరో వర్గానికి చెందిన టీడీపీ నేత జగన్‌మోహన్‌రాజు విడిగా తన వర్గంతోకలిసి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. చిట్వేలిలోనూ కస్తూరి విశ్వనాథనాయుడు, పంతగాని నరసింహప్రసాద్ వర్గాల మధ్య ఆధిపత్య పోరు స్పష్టంగా కనిపించింది.

చిట్వేలిలో చీలిన నాయకులు..

చిట్వేలి: రైల్వేకోడూరు నియోజకవర్గం చిట్వేలి మండలంలో బుధవారం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించే విషయంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు, పంతగాని నరసింహ ప్రసాద్ వర్గాల మధ్య వాదనలు చోటుచేసుకున్నాయి. మధ్యవర్తుల సూచన మేరకు కొంతసేపటి తర్వాత వివాదం సద్దుమణిగింది. కస్తూరి వచ్చి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి వెళ్లిపోగా, అనంతరం నరసింహ ప్రసాద్ వచ్చి అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎన్టీఆర్ చిత్రపటం పెట్టి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



రాజంపేటలో రచ్చరచ్చ

ఎన్టీఆర్ విగ్రహం వద్ద తమ వర్గీయులతో బత్యాల నివాళి

రాజంపేట: నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నేతలు వేర్వేరుగా బుధవారం నివాళులు అర్పించారు. ర్యాలీలు నిర్వహించారు. సేవా కార్యక్రమాలు చేశారు. ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు, మరో ఆశావహుడు చమర్తి జగన్‌మోహన్‌రాజులు తమ వర్గీయులతో వేర్వేరుగా పలు మండలాల్లో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ నేపథ్యంలో బత్యాలకే టికెట్ అని ఆయన వర్గీయులు, కాదు చమర్తికే టికెట్ అని ప్రత్యర్థి వర్గీయులు గళం విప్పారు.



ఎన్టీఆర్ సర్కిల్‌లో తమ వర్గీయులతో నివాళి అర్పిస్తున్న జగన్‌మోహన్‌రాజు

మదనపల్లెలో మూడుముక్కలాట



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న, ఎంపీ అభ్యర్థి గంటానరహరి, మాజీ ఎమ్మెల్యే రమేష్, శంకర్

మదనపల్లె: నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ తొలుత పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈలోపు రాజంపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి గంటానరహరి మదనపల్లెలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమానికి హాజరవుతున్నట్లు సమాచారం అందడంతో దొమ్మలపాటిరమేష్ ఆయన కోసం అక్కడే ఎదురుచూడసాగారు. ఇంతలో మాజీ ఎమ్మెల్యే రాటకొండ శోభ భర్త రాటకొండ బాబురెడ్డి తన అనుచరులతో కలిసి ఎన్టీఆర్ విగ్రహం వద్దకు వచ్చి నియోజకవర్గ ఇన్‌చార్జి దొమ్మలపాటి రమేష్‌ను మాటవరుసకైనా పలుకరించకుండానే పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత ఎంపీ అభ్యర్థి గంటానరహరి తంబళ్లపల్లె ఇన్‌చార్జి శంకర్‌తో కలిసి వచ్చి ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. తర్వాత దొమ్మలపాటి రమేష్ ఆయన వాహనంలో ఎక్కి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన రక్తదానశిబిరం ప్రారంభోత్సవానికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి నేరుగా గంటా నరహరి రాజంపేట టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో జిల్లా ప్రధానకార్యదర్శి యాలగిరి దొరస్వామినాయుడు ఆధ్వ ర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంది. అయితే దీనిని జరగనీయకుండా, ఆలస్యం చేయించి తన ఆధిపత్యాన్ని నిలుపుకునేందుకు దొమ్మలపాటి రమేష్ గంటానరహరిని మండలంలోని సీటీఎంలో జరుగుతున్న అన్నదాన కార్యక్రమానికి తీసుకెళ్లారని టీడీపీ శ్రేణులు పేర్కొంటున్నాయి. కాగా మరో ఎమ్మెల్యే ఆశావహుడు శ్రీరామినేని జయరామనాయుడు శివనగర్‌లోని తన కార్యాలయంలో వర్ధంతి వేడుకలు నిర్వహించి, చీకలబైలు సర్పంచ్ ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదానంలో పాల్గొన్నారు. టీడీపీ అధికార ప్రతినిధి ఆర్.జే.వెంకటేష్ నిమ్మనపల్లె సర్కిల్‌లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సమన్వయంతో విద్యాభివృద్ధికి కృషి

ఆర్జేడీ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి



కడప ఎడ్యుకేషన్: రాయలసీమ పరిధిలోని డీఈఓ, డిప్యూటీ ఈఓల సమన్వయంతో విద్యాభివృద్ధికి కృషి చేస్తామని, ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికలకు, మాకు ఎలాంటి సంబంధం లేదని ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్, పాఠశాల విద్య ఆర్‌జేడీ(ఎఫ్‌ఏసీ) బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లా డారు. 'నా భార్య ఎమ్మెల్సీ అయినంత మాత్రాన నేను ఎన్నికల్లో ఏదో చేస్తానని, అందుకోసమే నన్ను ఇక్కడికి పంపారని కొన్ని పత్రికలు, కొంతమంది వ్యక్తులు ఆరోపిస్తున్నారు.. ఇందులో ఎంతమాత్రం నిజం లేదు. రాజకీయాలకు మాకు ఎలాంటి సంబంధం లేదు. ఎన్నికలను విద్యా శాఖ నిర్వహించదని.. దానికి ప్రత్యేకంగా ఎన్నికల కమిషన్ ఉంటుంది' అన్నారు. ఉపాధ్యాయు సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం స్నేహ పూర్వకంగా ఉందన్నారు.

31లోపు టీచర్ల సర్దుబాటు

జిల్లావ్యాప్తంగా ఉన్న హైస్కూల్స్ ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను ఈనెల 31వ తేదీలోపు పూర్తి చేయాలని పాఠశాల విద్య ఆర్జేడీ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి సూచించారు. బుధవారం కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధ్యాయుల సర్దుబాటుపై ఎంఈఓలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

అర్జీదారుడికి జవాబుదారిగా ఉండాలి

జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి



సిబ్బంది పనితీరుపై ఆరా తీస్తున్న డీపీఓ

వాల్మీకిపురం: సచివాలయానికి వచ్చే అర్జీదారుడికి సిబ్బంది జవాబుదారీగా ఉండాలని అన్నమయ్య జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక సచివాలయం-3 ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, బయోమెట్రిక్, హాజరుపట్టిక, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సచివాలయాలకు వచ్చే ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందే సేవల్లో ఎవ్వరూ అశ్రద్ధ వహించవద్దని సూచించారు. పారిశుధ్యంపై ప్రత్యేక చొరవ తీసుకొని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ జయకుమారి, ఈఓపీఆర్‌డీ పాండురంగన్, ఈఓ ఉదయ్ కుమార్, సచివాలయ సెక్రటరీ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

విధినిర్వహణలో అలసత్వం వహిస్తే ఇంటికే



నడిమిచెర్ల గ్రామంలో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ గిరీషా పీఎస్

కలెక్టర్ గిరీషా పీఎస్

కలకడ: విధినిర్వహణలో అలసత్వం వహిస్తే సచివాలయ సిబ్బంది మొదలు, ఉపాధ్యాయుల వరకూ అందరిపై చర్యలు తప్పవని కలెక్టర్ గిరీషా పీఎస్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని నడిమిచెర్ల, ముడియంవారిపల్లె పంచాయతీలలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నడిమిచెర్ల వడ్డిపల్లెలో వారం రోజులుగా నీరు అందడం లేదని గ్రామస్తులు ఫిర్యాదు చేయగా వెంటనే స్కీంబోర్ అభివృద్ధి చేసి మంచినీరు అందించాలని ఏఈ ఇరగన్నను ఆదేశించారు. ప్రాముఖ్యత పనులలో నాణ్యత పాటించాలని, నూతన పనులు పూర్తి చేసినవారికి త్వరలో బిల్లులు చెల్లిస్తామన్నారు. ఇంటి నిర్మాణం పనులు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నడిమిచెర్ల పంచాయతీలో ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలకు హాజరు కావడం లేదని గ్రామస్తులు చెప్పగా ఉపాధ్యాయుడిని మందలించి పునరావృతం కాకూడదని ఎంఈఓ మునీంద్రనాయక్‌ను హెచ్చరించారు. కలకడ ఆదర్శ పాఠశాలకు బస్సు ఏర్పాటు చేయగా అదనంగా ప్రతి విద్యార్థి వద్ద రూ.పది వసూలు చేస్తున్నట్లు ఎంపీపీ శ్రీదేవి పేర్కొనగా స్పందించిన కలెక్టర్ ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి విద్యార్థుల బస్‌పాస్‌తో పాఠశాల వద్ద చేర్చాలని ఆదేశించారు. ఇంటినిర్మాణం విషయంలో ముడియంవారిపల్లెలో సమస్య ఉన్నట్లు సర్పంచ్ శాంతమ్మ తెలియజేయగా వెంటనే నిర్మాణాలు చేపట్టాలని, రికార్డులు లేకుండా అడ్డుపడేవారిపై కేసులు తప్పవని హెచ్చరించారు. నడిమిచెర్ల సర్పంచ్ నల్లమ్మ గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో చేపట్టిన పనులకు నిధులు కోరగా వెంటనే విడుదల చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాలలో అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీఓ నారాయణను ఆదేశించారు.

పండగ వాతావరణంలో గణతంత్ర వేడుకలు

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో 74వ భారత గణతంత్ర వేడుకలను పండగ వాతావరణంలో నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో ఈ నెల 26న స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూతన అన్నమయ్య జిల్లాలో గత ఏడాది ఆగస్టు 15న మొదటిసారిగా నిర్వహించిన భారత స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాన్ని అధికారులందరూ సమన్వయంతో విజయవంతం చేశామన్నారు. అలాగే గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. ఈ సమీక్షలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆక్వా హబ్‌లు, ఫిష్ వెండింగ్, రిటైల్ యూనిట్లను ఏర్పాటు చేయాలి

జిల్లాలో ఆక్వాహబ్‌లు, ఫిష్ వెండింగ్, రిటైల్ యూనిట్ల ఏర్పాటును వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని చాంబరులో జిల్లాలో ఆక్వాహబ్, ఫిష్‌ఆంధ్ర మినీ ఏర్పాటు, డొమెస్టిక్ మార్కెటింగ్‌పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సమీక్షించారు. జిల్లాలో ప్రతి మున్సిపాలిటీలో రెండు చొప్పున ఆక్వాహబ్‌లు నిర్మించేందుకు లబ్ధిదారుల ఎంపిక సత్వరమే పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు.

ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన నాలుగు చక్రాల వాహనం పంపిణీ

కలెక్టరేట్‌లో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద లబ్ధిదారునికి ప్రభుత్వం మంజూరు చేసిన నాలుగు చక్రాల వాహనాన్ని కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సుస్మిత, జిల్లా ఇరిగేషన్ అధికారి కృష్ణమూర్తి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, డీపీఓ ధనలక్ష్మి, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో తంబళ్లపల్లె టాప్

- జిల్లాలో కూలీలకు 88 లక్షల పనిదినాల లక్ష్యం
- ఇప్పటికే 69 లక్షల పని దినాల కల్పన
- తంబళ్లపల్లెలో బుధవారం ఒక్కరోజే పనిచేసిన కూలీలు 14,692 మంది
- జిల్లాలో రూ.240 కోట్ల వ్యయం



బి.కొత్తకోట మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులు

క్లస్టర్	బుధవారం పనిచేసిన కూలీలు	ఇప్పటిదాకా చేసిన ఖర్చు (లక్షల్లో)
కలికిరి	10,209	రూ.3,610.16
లక్కిరెడ్డిపల్లె	7,157	రూ.5,165.98
రాజంపేట	6,396	రూ.5,896.75
రాయచోటి	6,496	రూ.3,930.99
తంబళ్లపల్లె	14,692	రూ.5,419.87

బి.కొత్తకోట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో తంబళ్లపల్లె నియోజకవర్గం మొదటి స్థానంలో నిలిచింది. జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం కేటాయించిన నిధులతో లక్ష్యాలను సాధిస్తోంది. ప్రధానంగా కూలీలకు ఉపాధి కల్పించే విషయంలో నీటియాజమాన్య సంస్థ అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తూ లక్ష్యాలను సాధిస్తున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 30 మండలాల్లో కూలీలకు ఉపాధి కల్పించడం కోసం రూ.316 కోట్లను ఖర్చు చేయాలని నిర్ణయించారు. జిల్లాలో 1.90 లక్షల కుటుంబాలకు జాబ్‌కార్డులు ఉండగా అందులో 3.20 లక్షల మంది కూలీలు ఉన్నారు. వీరికి పూర్తిస్థాయిలో ఉపాధి పనులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించి ప్రణాళికను అమలు చేస్తోంది. ఈ ఉపాధి పనుల్లో తంబళ్లపల్లె నియోజకవర్గం మొదటి స్థానంలో నిలిచింది.

రూ.240 కోట్ల వ్యయం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఉపాధి కూలీలకు 88 లక్షల పనిదినాలు కల్పించాలన్నది లక్ష్యం. గత ఏప్రిల్ నుంచి ఈ రోజు (బుధవారం) వరకు ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు 68.35 లక్షల పనిదినాలు కల్పించారు. చేసిన పనులకు రూ.240.23 కోట్లు చెల్లించారు. ప్రణాళిక మేరకు కూలీలకు వేతనంగా రూ.226.16 కోట్లు, మెటీరియల్ కింద రూ.90 కోట్లు ఖర్చు చేయాలన్నది లక్ష్యం. అయితే బుధవారం నాటికే చేసిన పనులకు కూలీలకు వేతనంగా రూ.145 కోట్లు చెల్లించారు. మెటీరియల్ ఖర్చు విషయంలో ఇప్పటికే లక్ష్యానికి మించి రూ.95 కోట్లు ఖర్చు చేశారు. ఈ లక్ష్యాలను రెండు నెలల క్రితమే పూర్తి చేసేందుకు వీలుండేది. అయితే వ్యవసాయ పనులు, వర్షాల కారణంగా పనులకు ఆటంకం కలిగింది. దీంతో మిగిలిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ పనుల్లో తంబళ్లపల్లె నియోజకవర్గం మొదటిస్థానంలో నిలిచింది. నియోజకవర్గంలో బుధవారం ఒక్కరోజే 14,692 మంది కూలీలు ఉపాధి పనుల్లో పనిచేశారు. జిల్లాలోనే అత్యధికంగా ఈ నియోజకవర్గంలో రూ.54.19 కోట్లు ఖర్చు చేశారు. కలికిరి క్లస్టర్ పనుల్లో చివరి స్థానంలో ఉంది.

స్పెషల్ డ్రైవ్

జిల్లా ఉపాధి హామీ పథకం పనులు పెంచి కూలీలకు పనులు కల్పించడం కోసం కలెక్టర్ గిరీషా పీఎస్ స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని నీటి యాజమాన్య సంస్థ అధికారులను ఆదేశించారు. దీనితో అధికారులు ఈ జనవరి ఒకటి నుంచి ప్రత్యేక చర్యలు చేపట్టారు. వందరోజులు పూర్తి చేసుకోని కూలీలు, కుటుంబాలను గుర్తించి పనులు కల్పిస్తారు. ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న వ్యవసాయ, పండ్ల తోటల పనులు అధికంగా చేపట్టేలా అవగాహన చేపట్టారు. మార్చినాటికి లక్ష్యాలను పూర్తిచేసేలా కార్యాచరణ రూపొందించారు.

ఉపాధిలో రైతులకు ప్రయోజనాలు

ఉపాధి హామీ పథకంలో రైతాంగానికి ఎన్నో ప్రయోజనకరమైన పనులను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇందులో..

- చెరువు నుంచి చెరువుకు నీటిని మళ్లించే కాలువల నిర్మాణం
- రైతుల పొలాల్లో సరిహద్దు కందకాల తవ్వకం
- చెరువుల్లో పూడికతీత పనులు
- వైఎస్సార్ జగనన్న కాలనీల్లో పేదలు నిర్మించుకునే ఇళ్లకు 90 రోజుల పనిదినాలు
- పండ్లతోటల పెంపకం
- రోడ్లకు ఇరువైపులా మొక్కల పెంపకం
- అల్లనేరేడు-మామిడి మొక్కలకు రింగ్ ట్రంక్‌లు
- రైతుల పొలాల్లో సేద్యపు నీటి కుంటల నిర్మాణం
- పల్లెల నుంచి పొలాలకు వెళ్లేందుకు రోడ్ల నిర్మాణం

మార్చిలోగా పూర్తి



రూ.316 కోట్ల ఉపాధి లక్ష్యంలో ఇప్పటికే రూ.240 కోట్లు ఖర్చు చేశాం. మిగిలిన రెండున్నర నెలల్లో మరో రూ.76 కోట్లు ఖర్చు చేసి లక్ష్యాలు సాధిస్తాం. అయితే ప్రస్తుత పరిస్థితుల మేరకు లక్ష్యానికి మించిన పనులు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల కూలీల సంఖ్య భారీగా పెరిగింది. దీనితో బడ్జెట్ లక్ష్యం పూర్తిచేసినా పనులు కల్పించడం ఆగదు. దీనితో నిధుల వ్యయం లక్ష్యాలను మించుతుంది.

–ఎంసీ.మద్దిలేటి, డ్వామా పీడీ, రాయచోటి

పకడ్బందీగా పోలీసు కానిస్టేబుల్ పరీక్షలు

ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాట్లపై కాలేజీ యాజమాన్యంతో చర్చిస్తున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

మదనపల్లె: ఈనెల 22న జరిగే పోలీసు కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ ప్రిలిమినరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తామని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు. బుధవారం మదనపల్లె పట్టణం నిమ్మనపల్లె రోడ్డులోని కృష్ణచైతన్య ఫార్మసీ కాలేజీ, జెడ్పీ ఉన్నత పాఠశాల, జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీలలోని పోలీసు పరీక్షా కేంద్రాలను డీఎస్పీ కేశప్పతో కలిసి తనిఖీ చేశారు. పరీక్షా పత్రాలను ఉంచే స్ట్రాంగ్ రూములను, పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు పనితీరును పరిశీలించారు. స్ట్రాంగ్‌రూముల వద్ద రక్షణ దళాలు అప్రమత్తంగా విధులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారు.

క్లుప్తంగా

భార్య భర్తలపై దాడి
– 12 మందిపై కేసు

కలికిరి : భార్య భర్తలపై దాడి ఘటనకు సంబంధించి 12 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లోకేష్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గుండ్లూరు గ్రామం ఈతమానువడ్డిపల్లికి చెందిన పూజారి శ్రీనివాసులు, అతని భార్య చంద్రకళపై ఇదే గ్రామానికి చెందిన బి.రాధాక్రిష్ణ తన వర్గానికి చెందిన మరో 11 మంది పాతకక్షలతో ఈ నెల 15న రాత్రి దాడి చేసి గాయపరిచారు.శ్రీనివాసులు ఆపస్మారక స్థితికి చేరుకోవడంతో స్థానికులు 108 వాహనంలో పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చంద్రకళ ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన 12 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు కిందపడి యువకుడి మృతి
ఓబులవారిపల్లె : మంగంపేట రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి పోలి తిమ్మప్ప (20) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు మంగంపేట పునరావాస కాలనీ, 7వ వీధికి చెందిన తిమ్మప్ప త్రివేణి కంపెనీలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి వివాహం కాలేదు. తల్లిదండ్రులు జయమ్మ, గోపాల్ కూడా అదే కంపెనీలో పని చేస్తున్నారు. తిమ్మప్ప మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో మంగళవారం రాత్రి మంగంపేట రైల్వేస్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు క్రిందపడి మృతి చెందాడు. బుధవారం ఉదయం రైల్వేపోలీసులు మృతదేహానికి రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. తల్లిదండ్రులకు మృతదేహాన్ని అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఓకు తీవ్ర గాయాలు


గాయపడిన బాషావలి

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లెలో బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో లక్కిరెడ్డిపల్లె వీఆర్‌ఓగా పనిచేస్తున్న బాషావలి తీవ్రంగా గాయపడ్డాడు. బాషావలి ఓటుకు ఆధార్ నమోదు పని పూర్తిచేసుకొని సచివాలయానికి కాలి నడకన బయలుదేరాడు. ఇదే సమయంలో రామాపురం నుంచి వస్తున్న ద్విచక్రవాహనం ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆయనను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

కార్గో ఆదాయం అదుర్స్



- ప్రైవేటు లాజిస్టిక్‌తో ఒప్పందాలు
- సరుకు రవాణాలో జోన్–4 జోరు
- గతేడాది కంటే రూ. 10 కోట్లు పెరిగిన ఆదాయం



కడప ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని కార్గో కార్యాలయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కార్గో సరుకు రవాణాలో ఆర్టీసీ ఊహించిన దానికంటే అధిక ఆదాయాన్ని ఆర్జిస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ సేవలను మరింత విస్తృతం చేసే దిశగా ఆర్టీసీ అధికారులు ఆలోచిస్తున్నారు. సరుకు రవాణాలో కడప జోన్ పరిధిలో కడప, అన్నమయ్య, అనంతపురం,సత్యసాయి, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి జిల్లాలు ఉన్నాయి. ఈ జిల్లాల పరిధిలో 42 సరుకు రవాణా వాహనాలు ఉన్నాయి. వాటిలో 35 కంటైనర్లు, 7 డీజీటీలు ఉన్నాయి.ఇవన్నీ ఒక్కరోజు కూడా ఖాళీ లేకుండా ఆయా ప్రాంతాలకు సరుకులు తీసుకెళుతున్నాయి. ఇలా రోజురోజుకు పెరుగుతున్న కార్గో రవాణాతో వీటి సంఖ్యను పెంచేందుకు ఆర్టీసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. మరోవైపు కొత్తగా ప్రైవేటు లాజిస్టిక్ (పార్శిల్) సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందుకోసం ఆయా సంస్థలకు అధీకృత ఏజెన్సీలను ఇస్తారు. ఆపై ఆ సంస్థలు బుక్ చేసిన సరుకులను కానీ లేదా ఆ సంస్థలు రవాణా చేయగా మిగిలిన సరుకులను ఆర్టీసీ ద్వారా రవాణా చేసేలా చర్చిస్తున్నారు.

ఆర్టీసీ అధికారులు కార్గో ద్వారా ఇంకా ఆదాయాన్ని పొందేందుకు మార్గాలను అన్వేషిస్తున్నారు. ప్రైవేట పార్శిల్ సర్వీసులు సరుకులు గమ్యానికి చేర్చడానికి మూడు లేదా నాలుగు రోజుల సమయం పడుతుంటే ఆర్టీసీ కేవలం 24 నుంచి 48 గంటల్లోపే ఆయా ప్రాంతాలకు చేరుస్తున్నాయి.

కొరియర్ సేవల్లో దూకుడు

ఆర్టీసీ కొరియర్ సేవలకు ఆదరణ లభిస్తోంది.పార్శిల్ కౌంటర్ నుంచి పది కిలోమీటర్ల పరిధిలో 50 కిలోల బరువు వరకు వినియోగదారుడు కోరుకున్న చిరునామాకు వస్తువులను డోర్ డెలివరీ చేస్తున్నారు. ఇళ్లు మారాలనుకునే సామగ్రి తరలింపునకు కూడా ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ఇలా సరుకు రవాణా ద్వారా ఆదాయాన్ని ఆర్జిస్తోంది.

ఏటీబీ ఏజెంట్ల సంఖ్య పెంపు

ఆర్టీసీ కార్గోకు పెరుగుతున్న ఆదరణతో ఆథరైజ్డ్ టిక్కెట్ బుకింగ్ (ఏటీబీ) ఏజెంట్ల వ్యవస్థను విస్తరించాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతానికి ఈ జోన్‌లో 175 మంది ఏటీబీ ఏజెంట్లు ఉన్నారు. ఈ సంఖ్యను దాదాపు 400 వరకుపెంచేందుకు చర్యలు చేపడుతున్నారు. వీరికి బుకింగ్ చార్జీలు 15 శాతం కమిషన్‌గా చెల్లిస్తున్నారు. ఏటీబీ కోసం గ్రామీణ ప్రాంతంలో రూ. 1000, అర్బన్‌లో రూ. 5000 చొప్పున డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

రూ. 10 కోట్ల ఆదాయం

కార్గో రవాణాలో జోన్–4లో 2021–22 సంవత్సరంలో రూ. 25,04,90,000, 2022–23లో రూ. 35,21,80,000 ఆదాయాన్ని సాధించింది. గత ఏడాదితో పోలిస్తే ఈఏడాది రూ. 10 కోట్ల మేర అదనపు ఆదాయం చేకూరింది.

కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఆర్టీసీ కార్గో రవాణాకు ఆదరణ లభిస్తోంది. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం. సకాలంలో వస్తువులను చేర్చి ప్రజల అభిమానాన్ని పొందేడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ప్రైవేటు కార్గో సేవలతో పోలిస్తే ఆర్టీసీ కార్గో తక్కువ ఖర్చుతో సరుకులను రవాణా చేస్తోంది. ప్రజలు ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– గోపినాథరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, కడప

మహిళకు బంగారు ఆభరణాల బ్యాగ్ అప్పగింత


బాధితురాలికి బ్యాగ్‌ను అప్పగిస్తున్న పోలీసులు

రాయచోటిటౌన్ : ఓ మహిళ పోగొట్టుకున్న బ్యాగును రాయచోటి పోలీసులు రెండురోజుల్లోనే బాధితురాలికి అప్పగించారు. అర్బన్ సీఐ సుధాకరరెడ్డి కథనం మేరకు రాయచోటికి చెందిన భావన పని నిమిత్తం మంగళవారం కడపకు వెళ్లింది. తిరిగి బస్సులో రాయచోటికి వచ్చింది. ఆటోలో ఇంటికి బయలుదేరింది. ఈ క్రమంలో ఆటోలో బ్యాగ్ మరిచిపోయింది.ఇంటికి వెళ్లాక చూసుకుంటే బ్యాగ్ కనిపించలేదు.ఆటో కోసం వెతికారు. ప్రయోజనం లేకపోవడంతో అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాగ్‌లో 45 గ్రాముల బంగారు, 5 తులాల వెండి ఆభరణాలు, రెండు సెల్ ఫోన్లు ఉన్నాయని బాధితురాలు పోలీసులకు తెలిపింది. వెంటనే సీఐ సిబ్బందితో కలిసి వెతికారు. బుధవారం సీసీ కెమెరాల ఆధారంగా ఆటో ఆచూకీ తెలుసుకుని డ్రైవర్‌ను పట్టుకుని విచారించారు. తాను బ్యాగ్‌ను చూడలేదని చెప్పడంతో పోలీసులు ఆటోలో వెతికారు.బ్యాగ్ కనిపించింది. అందులోని బంగారు, వెండి ఆభరణాలు, ఇతర వస్తువులు ఉన్నాయి. వీటిని తీసుకొచ్చి బాధితురాలికి అప్పగించారు. బాధితురాలు పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేసింది.

ప్రాణం తీసిన అతివేగం

- చెట్టు ఢీకొన్న కారు
- ఇద్దరు యువకుల మృతి


నుజ్జునుజ్జయిన కారు


సిద్దేశ్వర్‌రెడ్డి, తేజేశ్వర్‌రెడ్డి మృతదేహాలు

ఓబులవారిపల్లె : మండలంలోని యాల్లాయపల్లె పంచాయతీ అప్పగుంటపల్లె గ్రామం సమీపంలో చెట్టును కారు ఢీకొనడంతో దినేష్‌కుమార్‌రెడ్డి అలియాస్ సిద్దేశ్వర్(26),తేజేశ్వర్‌రెడ్డి(26) అక్కడికి అక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. పెద్దఓరంపాడు గ్రామనికి చేదిన ముద్దా సుధాకర్‌రెడ్డి ఒక్కగానొక్క కుమారుడు సిద్దేశ్వర్‌రెడ్డి హైదరాబాద్‌లో షార్ట్‌ఫిలిమ్ డైరెక్టర్‌గా చేస్తున్నాడు. నందలూరు గ్రామానికి చేందిన కసిరెడ్డి బలరామిరెడ్డి కుమారుడు తేజేశ్వర్‌రెడ్డి ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. సంక్రాంతి పండుగకు తేజేశ్వర్‌రెడ్డి అమ్మమ్మ గారి ఊరు పెద్దఓరంపాడు గ్రామానికి వచ్చాడు. వీరు మరో ముగ్గురు స్నేహితులు కరీముల్లా,సాయి,భువనేశ్వర్‌రెడ్డితో కలిసి కొర్లకుంట నుంచి పెద్దఓరంపాడుకు కారులో బుధవారం బయలుదేరారు. యల్లాయపల్లె గ్రామం దాటిన తర్వాత అప్పగుంటపల్లె సమీపంలో అదుపుతప్పి వేగంగా చెట్టును ఢీకొన్నారు. ప్రమాదంలో సిద్దేశ్వర్‌రెడ్డి, తేజేశ్వర్‌రెడ్డి అక్కడికి అక్కడే మృతి చెందారు. స్థానికులు గమనించి గాయపడిన వారిని 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. షేక్ కరీముల్లా, సాయి ఇద్దరికి తీవ్రగాయాలు కాగా భువనేశ్వర్‌రెడ్డికి ఎలాంటి గాయాలు కాలేదు. సిద్దేశ్వర్‌రెడ్డి, తేజేశ్వర్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగి పోయారు. పెద్దఓరంపాడు గ్రామంలో విషాయదఛాయలు అలముకున్నాయి. మృతదేహలను పోస్టు మార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

రేపటినుంచి శ్రీ దర్గా స్వామిజీ ఆరాధనోత్సవాలు

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేట గ్రామ సమీపంలో శ్రీ దర్బారు సాయి నగరంలో వెలసిన శ్రీ దర్గా స్వామిజీ చతుర్థ ఆరాధనోత్సవాలు ఈనెల 20వ తేదీ (శుక్రవారం) నుంచి జరుగుతాయని భక్తులు తెలిపారు. శుక్రవారం ఉదయం 8గంటలకు గంగపూజ, కలశ స్థాపన, పుణ్యాహవచనము, రుద్రాభిషేకం, మహామంగళహారతి, సాయంత్రం గురుపూజ, విష్ణు సహస్రనామార్చన, మహామంగళహారతి జరుగుతాయన్నారు. శనివారం ఉదయం 7గంటలకు కలశపూజ, సద్గురు పూజ, రుద్రాభిషేకం, గణపతి, నవగ్రహ రుద్ర, సద్గురు హోమాలు, పూర్ణాహుతి, మహామంగళహారతి, సత్సంగము, ప్రసాద వితరణ, సాయంత్రం పల్లకి మెరవణి నిర్వహించనున్నట్లు భక్తులు తెలిపారు. ఈ కార్యక్రమాలను బెంగళూరు వేదపండితుల ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొని శ్రీ స్వామిజీ, మాతాజీ దివ్య సమాధులను దర్శించి అనుగ్రహ ఆశీస్సులు పొందాలని భక్తులు తెలిపారు.

ముగిసిన స్టాఫ్‌నర్స్ నియామకాల కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ ఆర్డీ కోటేశ్వరి

కడప రూరల్ : వైఎస్సార్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్‌ల నియామకం, పోస్టింగ్ ప్రదేశాల కేటాయింపుల కౌన్సెలింగ్ ముగిసింది. బుధవారం జోన్–4 పరిధిలోని రామలసీమ జిల్లాలకు చెందిన 137 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ రీజనల్ డైరెక్టర్(ఆర్డీ) డాక్టర్ కోటేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం, మెరిట్ ప్రాతిపదికన నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు విధి నిర్వహణలో ప్రజల మన్ననలు పొందాలని అన్నారు. కార్యక్రమంలో సూపరిండెంట్ పత్తికొండ శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్స్ రఘు, అల్తావుల్లా, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి రూ. 5లక్షలు మంజూరు చేయాలి


జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

రాయచోటి అర్బన్ : జగనన్న ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేస్తున్న మొత్తాన్ని రూ.5లక్షలకు పెంచడం ద్వారా సీఎం జగనన్న నిలిచిపోవాలని సీపీఐ నేతలు అన్నారు.బుధవారం నారాయణరెడ్డిపల్లె సమీపంలోని జగనన్న కాలనీని సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య నేతృత్వంలో పార్టీ సభ్యులు పర్యటించారు కాలనీలో ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు.అనంతరం ఈశ్వరయ్య మాట్లాడుతూ ఇంటినిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేస్తున్న రూ.1.80లక్షలు చాలడం లేదన్నారు. వెంటనే రూ.5 లక్షలను మంజూరు చేయడంతో పాటు సిమెంటు, ఇసుకలను ఉచితంగా అందచేయడం ద్వారా జగనన్న చరిత్రలో నిలిపోవాలంటూ కోరారు.సీపీఐ పోరుబాట నేటినుంచి జనవరి 30వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి. మహిళా సమాఖ్య నాయకురాలు సుమిత్ర, పట్టణ నేతలు ఖాదర్‌బాషా, సలీం, ముబారక్‌లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


రెడ్డిశేఖర్ మృతదేహం

పీలేరు రూరల్ : విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం పీలేరు పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలు.. పీలేరు పట్టణం ఎస్‌కేడీ నగర్‌కు చెందిన తుపాకుల సహదేవ కుమారుడు రెడ్డిశేఖర్(27) బుధవారం పట్టణంలోని రోజాఫ్లాట్‌వద్ద భూమిని చదును చేస్తున్న స్నేహితుడు వినోద్ వద్దకు వెళ్లాడు. మట్టి చదును చేసే ప్రాంతంలో విద్యుత్ తీగెలు కిందకు వేలాడుతున్నాయి. పొరపాటున రెడ్డిశేఖర్ చేతులు పైకెత్తడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఈ సంఘటనలో రెడ్డిశేఖర్ అక్కడే కుప్పకూలిపోయాడు.అతన్ని వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈసంఘటనపై మృతుడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు.

గొర్రెల కాపరికి గాయాలు

సంబేపల్లె : మండలంలోని రౌతుకుంట గ్రామం బోయపల్లెకు చెందిన జె.చంటి అనే గొర్రెల కాపరికి గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు కథనం మేరకు చంటి గొర్రెలు మేపుకొని జీవనం సాగిస్తున్నాడు. బుధవారం గ్రామ సమీపంలోని పొలాల్లో తీవ్రగాయాలతో పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.వారు చంటిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గొర్రెల కాపరిపై దాడి జరిగిందా లేక ఏదైనా ప్రమాదం జరిగి గాయపడ్డాడా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వురు ప్రాంతాల్లో బుధవారం ముగ్గురు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. మదనపల్లె రూరల్ పరిధిలోని కోళ్లబైలు పంచాయతీ బాబుకాలనీకి చెందిన టి.సుప్రియ(29) కుటుంబ కలహాల కారణంగా పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.రామసముద్రం మండలం గుంత ఎంబాడి గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి భార్య వెంకటలక్ష్మి (30) కుటుంబ సమస్యలతో మంగళవారం రాత్రి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత మండల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మనపల్లె : మద్యం తాగవద్దని మందలించినందుకు యువకుడు ఆత్మహత్యకు యత్నించిన సంఘటన నిమ్మనపల్లె మండలంలో బుధవారం జరిగింది. నిమ్మనపల్లె పంచాయతీ నాగులయ్యగారిపల్లెకు చెందిన రామయ్య కుమారుడు ఎస్.గిరి(23) మద్యానికి అలవాటు పడి జులాయిగా తిరుగుతుండటంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన గిరి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

నిర్మాణాల తొలగింపులో ఉద్రిక్తత


సబ్‌కలెక్టర్‌తో మాట్లాడుతున్న కన్యక చెరువు మత్స్యకారులు

నందలూరు(రాజంపేట) : కన్యక చెరువులో చేపలు పట్టుకుని జీవించే మత్స్యకారులు చేపల విక్రయానికి సంబంధించి నిర్మించుకున్న కట్టడాలు తొలగింపులో బుధవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాజంపేట సబ్‌కలెక్టర్ అహ్మద్‌ఖాన్ స్వయంగా కట్టడాలను పరిశీలించారు. తొలిగింపునకు శ్రీకారం చుట్టారు.అయితే వీటిని తొలగించొద్దని స్థానిక తహసీల్దారు ఉదయశంకర్‌రాజుతో మొరపెట్టుకున్నారు. జిల్లా వక్ఫ్‌బోర్డు జనరల్ సెక్రటరీ సయ్యద్‌అమీర్, నాగిరెడ్డిపల్లె అర్బన్ సర్పంచి జంబుసూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు మత్స్యకారులుకు మద్దతుగా నిలిచారు.సబ్‌కలెక్టర్‌కు వారి ఆవేదనను విన్నవించారు. కాగా నిర్మాణాల తొలిగింపు వివాదం తలెత్తిన నేపథ్యంలో ఎస్‌ఐ మైనుద్దీన్ ఆధ్వర్యంలో పోలీసుబందోబస్తు నిర్వహించారు.

కిసాన్ మేళాను విజయవంతం చేయాలి

కడప అగ్రికల్చర్ : వైఎస్సార్‌జిల్లా ఊటుకూరులో వ్యవసాయ పరిశోధనస్థానం, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్న కిసాన్ మేళాను విజయవంతం చేయాలని తిరుపతి వ్యవసాయ పరిశోధన స్థానం సహ సంచాలకులు డాక్టర్ రాజశేఖర్, పరిశోధన సంచాలకులు డాక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిసాన్ మేళాలో భాగంగా ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు రూపొందించిన ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై, వివిధ పంటల్లో నాణ్యమైన, కొత్త రకాల విత్తనాలు, జీవన ఎరువులు, నమూనా పంటలు, ఇతర సమాచార పుస్తకాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. అలాగే శాస్త్రవేత్తలతో చర్చాగోష్ఠి ద్వారా పంటల సాగులో ఎదురయ్యే సమస్యలకు రైతులు సూచనలు పొందొచ్చని చెప్పారు.

ఆదాయపు పన్ను పరిమితి పెంచాలి


సాఫ్ట్‌వేర్‌ను విడుదల చేస్తున్న పోచంరెడ్డి సుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, పీఎస్‌టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయులకు సంబంధించి వ్యక్తిగత ఆదాయపన్ను పరిధిని రూ. 5లక్షలకు, పొదుపులను రూ.3 లక్షలకు పెంచాలని మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి , పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ. రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ప్రగతిశీల ఉపాధ్యాయ సంఘం(పీఎస్‌టీయూ) ఆధ్వర్యంలో తయారు చేసిన ఆదాయపుపన్ను సాఫ్ట్‌వేర్‌ను ప్రగతిశీల ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి ఇలియాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, కార్యదర్శి మునిరెడ్డి, వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం దాదాపు ఎనిమిదేళ్లుగా ప్రవేశపెట్టిన ఏ బడ్జెట్‌లోనూ వ్యక్తిగత ఆదాయపన్ను పరిధిని పెంచిన దాఖలాలు లేవన్నారు. ప్రతి సంవత్సరం జిమ్మిక్కు చేస్తోందన్నారు.ఫిబ్రవరి 1వ తేదీన ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో ఆదాయ పన్ను పరిధిని పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయులు, అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జక్రియ, వైఎస్సార్‌జిల్లా ప్రధాన కార్యదర్శి రామలక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఫీల్డ్ ఆర్చరీ పోటీల్లో రాణించాలి


ఏపీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : జాతీయస్థాయి ఫీల్డ్ ఆర్చరీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు రాణించాలని ఏపీ ఫీల్డ్ ఆర్చరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.గిరిధర్‌రెడ్డి కోరారు. బుధవారం కడప నగరం ఎన్‌జీఓ కాలనీలోని విజయాస్ ఆర్చరీ అకాడమీలో ఫీల్డ్ ఆర్చరీ రాష్ట్రస్థాయి క్రీడా ఎంపికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి ఎంపికలకు 7 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరుకావడం సంతోషంగా ఉందన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. ఏపీ ఫీల్డ్ ఆర్చరీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వర్ధి చెన్నకేశవులు మాట్లాడుతూ ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో 12, 13వ జాతీయస్థాయి ఫీల్డ్ ఆర్చరీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎంపికల్లో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన 29 మంది క్రీడాకారులను ఏపీ జట్టుకు ఎంపికచేసినట్లు తెలిపారు. అనంతరం విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో శిక్షకుడు రవిబాబు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సుత్తితో కొట్టి బాలుడి హత్య


నందకిశోర్ (ఫైల్)

సంబేపల్లె : ఆవేశాన్ని ఆపుకోలని ఓ వ్యక్తి అభం శుభం తెలియని ఓ బాలుడి తలపై సుత్తితో బాదడంతో మృతిచెందిన ఘటన బుధవారం అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలం దేవపట్ల రెడ్డివారిపల్లెలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దేవపట్ల రెడ్డివారిపల్లెకు చెందిన కుడుం రామాంజులు, కళావతి దంపతుల రెండో కుమారుడు నందకిశోర్ తన స్నేహితులతో కలిసి తమ వీధిలోని గౌతమ్‌రెడ్డి అనే వ్యక్తి ఇంటి వద్ద ఆడుకోసాగాడు. అయితే తన ఇంటి ముందు అల్లరి ఆపమంటూ గౌతమ్‌రెడ్డి కోప్పడ్డాడు. మిగిలినవారు భయపడి పారిపోగా.. నందకిశోర్ మాత్రం నిదానంగా వెళ్లసాగాడు. అయితే ఆవేశం ఆపుకోలేని గౌతమ్‌రెడ్డి సుత్తి తీసుకొని బాలుడి తలపై విచక్షణా రహితంగా కొట్టడంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. దీంతో గౌతమ్‌రెడ్డి ఘటనా స్థలం నుండి పారిపోయాడు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.